
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 31 । జనవరి । 2023



నేటి నుంచి చినమేడారం జాతర

చిన మేడారంగా పేరుగాంచిన ఎదిరగుట్టల సమ్మక్క సారలమ్మ జాతర మంగళవారం ప్రారంభం కానుంది.

8లో



ఐదేళ్లలో 100 మిలియన్ టన్నులు

రాబోయే ఐదేళ్లలో సింగరేణి ఆధ్వర్యాన 100 మి. టన్నుల బొగ్గు ఉత్పత్తికి ప్రణాళిక రూపొందించామని డైరెక్టర్ (పా) చెప్పారు.

10లో

గరిష్టం / కనిష్టం
34° / 19°

వాతావరణం

జిల్లాలో మంగళవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం, రాత్రి వేళల్లో కొంత చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి సోమవారం స్వామి వారిని ఈ రూపంలో అలంకరించడం ప్రత్యేకత. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మ వారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

డీఈఓగా ప్రసాద్ బాధ్యతల స్వీకరణ



నూతన డీఈఓ ప్రసాద్

కొత్తగూడెంఅర్బన్: జిల్లా నూతన విద్యాశాఖ అధికారిగా ఎన్.ఎస్.ఎస్. ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ఇది పూర్తయ్యేంత వరకు ప్రసాద్ ఇన్‌చార్జ్ డీఈఓగా పని చేయనున్నారు. ఈ మేరకు ఆదివారం స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎ.శ్రీదేవసేనా ఉత్తర్వులు జారీ చేయగా, సోమవారం ప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లను సీనియారిటీ జాబితా ప్రకారం చేయిస్తామని, ఎవరికీ నష్టం జరుగకుండా చూస్తామని తెలిపారు. ఉపాధ్యాయులు హార్డ్ కాపీలను స్కూళ్లలో ఫిబ్రవరి 2 వరకు సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు. బదిలీలు, ప్రమోషన్ల విషయంలో ఎవరూ మధ్యవర్తులను, దళారులను నమ్మవద్దని, ఏమైనా సమస్యలుంటే నేరుగా తన వద్దకు రావచ్చని వివరించారు. ఈ ప్రక్రియ అంతా పారదర్శకంగా జరుగుతోందని, సంబంధిత లిస్టులు కూడా ఆన్‌లైన్‌లో పెడతామని తెలిపారు.

జిల్లాకు రూ.188.10 కోట్లు విడుదల

– హామీ అమలు చేసిన సీఎం

సూపర్‌బజార్(కొత్తగూడెం): నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవ సభలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీల మేరకు సోమవారం రూ. 188.10 కోట్లు విడుదల చేశారు. జిల్లాలోని 481 గ్రామ పంచాయతీలు ఉండగా, ఒక్కో పంచాయతీకి రూ.10 లక్షల చొప్పున మంజూరు చేస్తామని సీఎం కేసీఆర్ చెప్పిన విషయం తెలిసిందే. ఈ మేరకు పంచాయతీలకు రూ.48.10 కోట్లు, ఇల్లెందు, మణుగూరు మున్సిపాలిటీలకు రూ. 25 కోట్ల చొప్పున, చింతలచెరువు మరమ్మతులు, మినీ ట్యాంక్‌బండ్ నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ తదితర సౌకర్యాలకు రూ.10 కోట్లు మంజూరు చేశారు. అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదనలు పంపాలని ప్రభుత్వ ప్రత్యేక చీఫ్ సెక్రటరీ కె రామకృష్ణారావు కలెక్టర్‌కు సూచించారు.

ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు పొడగింపు

కొత్తగూడెంఅర్బన్: ఉపాధ్యాయుల బదిలీలు, ఆన్‌లైన్ దరఖాస్తుల గడువును ఫిబ్రవరి 1 వరకు పొడగించినట్లు డీఈఓ ఎన్.ఎస్.ఎస్. ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల్లో మార్పులు, చేర్పులు, ప్రిఫరెన్స్ కేటగిరీలో మెడికల్ బోర్డు వారు ఇచ్చిన సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేసుకునేందుకు రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ అనుమతి ఇచ్చారని వివరించారు. ఈ అవకాశాన్ని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

డైరెక్టర్(పా)గా బలరామ్‌కు అదనపు బాధ్యతలు



బలరామ్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ఫైనాన్స్ డైరెక్టర్ ఎన్. బలరామ్‌కు డైరెక్టర్(పా) గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు సీఎండీ ఎన్. శ్రీధర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత డైరెక్టర్(పా) ఎస్.చంద్రశేఖర్ నేడు ఉద్యోగ విరమణ పొందుతుండడంతో ఆయన బాధ్యతలను బలరామ్‌కు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

మన మిథాలీ.. త్రిష!



భద్రాచలంలో శిక్షణ సందర్భంగా కుమార్తె త్రిషతో రామిరెడ్డి (ఫైల్)

'దంగల్' సినిమా మాదిరి కుమార్తెను తీర్చిదిద్దిన రామిరెడ్డి

- అండర్–19 ఉమెన్స్ వరల్డ్ కప్ జట్టులో భద్రాద్రి బిడ్డ
- రెండేళ్ల నుంచే క్రికెట్ కోచింగ్ మొదలెట్టిన తండ్రి
- ఏడేళ్ల వయసులో హైదరాబాద్‌కు మకాం
- జట్టు విజయంతో జిల్లా వాసుల సంబరాలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: స్పోర్ట్స్ నేపథ్యంలో వెండితెర మీద విజయఢంకా మోగించిన సినిమాలు ఎన్నో. అందులో రియల్ స్టోరీ ఆధారంగా తెరకెక్కిన దంగల్‌కు ప్రథమ స్థానం దక్కుతుంది. జాతీయ జట్టుకు ఆడలేకపోయిన మల్లయోధుడు మహవీర్ తన ఇద్దరు కూతుళ్లను మల్లయోధులుగా తీర్చిదిద్ది దేశానికి అనేక పతకాలు వచ్చేలా ఎంతో శ్రమించాడు. ఆ కష్టాన్ని అమీర్‌ఖాన్, ఫాతిమాసనా, మల్హోత్రా వెండితెర మీద కళ్లకు కట్టారు. అచ్చంగా అలాంటి స్ఫూర్తిదాయక జీవితాలు మన జిల్లాలో చోటు చేసుకున్నాయి. గోదావరి తీరాన శ్రీరాముడి పాదాల చెంతన గొంగడి త్రిష – రామిరెడ్డి మన దంగల్ కథలో ఉన్నారు. 22 గజాల క్రికెట్ పిచ్‌లో రాణించేందుకు త్రిష సాగించిన ప్రయాణం ఆమె తండ్రి రామిరెడ్డి మాటల్లో..



త్రిషను అభినందిస్తున్న భద్రాద్రి వాసులు (ఫైల్)

క్రికెటర్‌ను చేయాలని..

స్వతహాగా నేను టెన్నిస్ ప్లేయర్‌ను. ఆటల్లో నా వారసులు నన్ను మించేలా ఎదగాలని అనుకున్నా. ఒక క్రీడాకారుడిగా నా జీవితంలో ఎదురైన అనుభవాల ఆధారంగా నా పిల్లలకు క్రీడల్లో ఆటంకాలు రాకుండా చూసుకోవాలని పిల్లలు పుట్టకముందే నిర్ణయించుకున్నా. అప్పటి వరకు ఉన్న ఆటలను పరిశీలిస్తే షటిల్, టెన్నిస్ తదితర క్రీడలు హైట్ అడ్వాంటేజ్ గేమ్స్. ప్లేయర్‌లో ఎంత ప్రతిభ ఉన్నా హైట్ సరిగా లేకపోతే ఈ ఆటల్లో రాణించడం కష్టం. అయితే ఎత్తుతో సంబంధం లేని గేమ్స్ ఏంటని పరిశీలిస్తే ఫుట్‌బాల్, క్రికెట్ కనిపించాయి. భద్రాచలంలో ఫుట్‌బాల్ ఆడేందుకు, కోచింగ్ ఇచ్చేందుకు అనుకూలమైన పరిస్థితి లేదు. అదే క్రికెట్ అయితే గల్లీ నుంచి భద్రాద్రి కప్ వరకు పాజిటివ్ ఎన్విరాన్‌మెంట్ ఉన్నట్టు అనిపించింది. దీంతో నాకు అమ్మాయి పుట్టినా, అబ్బాయి పుట్టినా భవిష్యత్తులో క్రికెట్‌లో గొప్ప స్థాయికి వెళ్లేలా అండగా నిలవాలని నిర్ణయించుకున్నా.

రెండేళ్ల నుంచే..

సాధారణంగా పిల్లలకు ఏడేళ్ల నుంచి ఏదైనా ఆటలో ప్రొఫెషనల్ కోచింగ్ ఇప్పించడం మొదలవుతుంది. కానీ నేను త్రిషకు రెండేళ్ల వయసు నుంచే ప్రారంభించా. త్రిష పుట్టిన సమయానికి ఉమెన్ క్రికెట్‌లో మిథాలీరాజ్ డబుల్ సెంచరీలతో సంచలనాలు నమోదు చేస్తోంది. లేడీ సచిన్‌గా పేరు తెచ్చుకుంది. దీంతో మిథాలీ స్ఫూర్తితో రెండేళ్ల వయసులో తనకు ఏమీ తెలియనప్పటి నుంచే క్రికెటింగ్ షాట్లు ఆడటం నేర్పిస్తూ వచ్చా. అది తనకు తెలియకుండానే మజిల్ మెమోరీలో ఇమిడిపోయింది. అది త్రిషకు ఎంతో ఉపయోగపడింది. తను ఎదుగుతున్న కొద్దీ ఆటలో ఆ తేడాను బయటి వాళ్లు కనిపెట్టలేకపోయినా నేను పసిపగట్టా. దీంతో ఆమె ఏదో ఒక రోజు ఇండియా తరఫున ఉమెన్ క్రికెట్‌కు ప్రాతినిధ్యం వహించడమే కాదు.. కచ్చితంగా వరల్డ్ కప్ కూడా ఆడుతుందనే విశ్వాసం కలిగింది.

ఏడేళ్ల వయసులో హైదరాబాద్‌కు..

అడ్వాన్స్, సైంటిఫిక్ కోచింగ్ కోసం త్రిషకు ఏడేళ్ల వయసు ఉన్నప్పుడు హైదరాబాద్‌కు షిఫ్ట్ అయ్యాం. సెయింట్ జాన్స్ క్రికెట్ అకాడమీకి వెళ్లాం. అక్కడ జాన్ మనోజ్ సార్ త్రిష వీడియోను పరిశీలించి, ఏదో ఒకరోజు ఇండియా తరఫున ఆడుతుందని చెప్పారు. ఆర్. శ్రీధర్, ఇక్బాల్ ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. రోజుకు 8 గంటల పాటు సాధన చేసేది. వారి అంచనాలను నిజం చేస్తూ అండర్ –16లో దేశానికి, 12 ఏళ్లకు చాలెంజర్స్ సిరీస్‌కు ఎంపికైంది. దీంతో మా నమ్మకం వమ్ము కాదనే విశ్వాసం ఏర్పడింది.

హ్యాపీగా ఉంది..

నా అంచనాలకు మించి ఏకంగా వరల్డ్ కప్ విన్నింగ్ టీమ్‌లో మెంబర్‌గా ఉండటమే కాదు.. ఫైనల్‌లో విలువైన పరుగులు చేసింది త్రిష. మా కుటుంబం, బంధువులు, కోచ్‌లు అందరం సంతోషంగా ఉన్నాం. త్రిష విజయాన్ని భద్రాచలం పట్టణం అంతా కేక్‌లు కట్ చేసుకుని తమ ఇంటి పండగలా చేసుకోవడం చూస్తే పట్టరాని సంతోషం కలుగుతోంది.

మా టార్గెట్ అదే..

అండర్– 19 వరల్డ్ కప్ విన్నింగ్ జట్టులో ఉన్న త్రిష ప్రస్తుతం భావనాస్ కాలేజీలో ఇంటర్మీడియెట్ సెకండియర్ (సీఈసీ) చదువుతోంది. రాబోయే రోజుల్లో ఇండియన్ సీనియర్స్ జట్టుకు ఎంపిక కావాలనేది లక్ష్యం. అంతేకాదు ఉమెన్ వరల్డ్ కప్ స్క్వాడ్‌లో తాను ఉండాలి.. కప్ కొట్టాలనేది మా కుటుంబ ఆకాంక్ష.

సమస్యలపై తక్షణమే స్పందించాలి



ప్రజావాణిలో సమస్యలు వింటున్న కలెక్టర్, పక్కన అదనపు కలెక్టర్

- ప్రజావాణిలో వచ్చిన వినతులను పరిష్కరించండి
- అధికారులకు కలెక్టర్ ఆదేశం

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజావాణిలో వివిధ సమస్యలపై ప్రజలు ఇచ్చే వినతులను పరిశీలించి, ఆ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ అనుదీప్ అధికారులను ఆదేశించారు. నూతన కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి, సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అనేక మారుమూల గ్రామాల నుంచి ఎంతో నమ్మకంతో ప్రజావాణి కార్యక్రమానికి వస్తున్నారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయవద్దని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె. వెంకటేశ్వర్లు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణి వినతుల్లో కొన్ని..

- తాము వంశపారంపర్యంగా సాగు చేసుకుంటున్న ఐదెకరాల భూమిని సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి కుండ స్వామి, అతడి కుమారులు శ్రీనివాస్, నరేష్‌ల పేరుతో అన్యాయంగా పట్టా చేయించుకున్నారని, విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని ఇల్లెందు మండలం పాతపూసలపల్లి గ్రామం తిలక్‌నగర్‌కు చెందిన ముడిగ కృష్ణకుమారి, ముడిగ సీత, ముడిగ సుగుణ, ముడిగ భద్రమ్మ, కుండ మహేష్ ఫిర్యాదు చేశారు. ఈ దరఖాస్తును ఇల్లెందు తహసీల్దార్‌కు కలెక్టర్ ఎండార్స్ చేశారు.
- ఇద్దరు పిల్లల పోషణ, వారిని చదివించడం భారంగా ఉందని, తనకు ఏదైనా ఉద్యోగం ఇప్పించాలని లేదా దళితబంధు అందించాలని కొత్తగూడెంలోని ఫ్యూన్‌బస్తీకి చెందిన కళ్లోజి సునీతారాణి వినతిపత్రం అందజేయగా, ఉపాధి కల్పన శాఖ అధికారికి ఎండార్స్ చేశారు.
- రేగుబల్లి రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూమిని తాను 30 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నానని, ఇటీవల అందులో కొందరి పేర్లను చేర్చి తనకు అన్యాయం చేశారని దుమ్ముగూడెం మండలం రామారపేటకు చెందిన కారం భద్రమ్మ కలెక్టర్‌కు వినతిపత్రం అందించింది. విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరగా, తగు చర్యల నిమిత్తం దుమ్ముగూడెం తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు.

మహనీయుల ఆశయసాధనకు కృషి చేయాలి

స్వాతంత్య్ర సంగ్రామంలో ప్రాణాలర్పించిన అమర వీరుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ అనుదీప్ అన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతిని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించారు. రెండు నిమిషాల పాటు మౌనం పాటించిన తర్వాత కలెక్టర్ మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన నేతలను స్మరించుకునేందుకు ప్రతి సంవత్సరం జనవరి 30న త్యాగధనుల సంస్మరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్లు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చట్టాలను ఉల్లంఘిస్తే శిక్షార్హులే..

ప్రతి పౌరుడు పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణి సంరక్షణ, జంతుహింస విచారణ చట్టాలను పాటించాలని, వీటిని ఉల్లంఘిస్తే శిక్షార్హులేనని కలెక్టర్ అనుదీప్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జంతు సంక్షేమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జంతువులకు, పక్షులకు, నీటిలో బతికే జీవాలకు హాని కలిగించవద్దన్నారు. పక్షులు నివాసం ఉండే చెట్లను నరకరాదన్నారు. జంతు సంరక్షణకు భారత ప్రభుత్వం యానిమల్ వెల్ఫేర్ బోర్డు ఆఫ్ ఇండియాను స్థాపించిందని చెప్పారు. ఈ బోర్డుకు కలెక్టర్ అధ్యక్షుడిగా ఉంటారని, సంబంధిత శాఖాధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సభ్యులుగా ఉంటారని వివరించారు. పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా రోగనిరోధక టీకాలు వేయించాలన్నారు. పశువుల రవాణాలోనూ నిబంధనలు పాటించాలని, లేదంటే శిక్ష తప్పదని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా పశువైద్యాధికారి బి.పురంధర్, సంక్షేమబోర్డు అధికారులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పీడీవీ అంజనేయశర్మ, ప్రసాదరావు, జేపీఎస్ చంద్రశేఖర్, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

కారుణ్య నియామకపత్రాల అందజేత

వివిధ ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తూ మరణించిన వారి వారసులకు స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో కలెక్టర్ అనుదీప్ కారుణ్య నియామకపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేసే అవకాశం వచ్చిందని, సక్రమంగా విధులు నిర్వర్తించి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవాలని సూచించారు.

'మారెళ్లపాడు' పనులు వేగవంతం చేయండి



ఎత్తిపోతల పథకం నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అధికారులు, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు

అశ్వాపురం: సీతారామ ప్రాజెక్ట్ కింద అశ్వాపురం మండలంలో అదనపు ఆయకట్టుకు సాగునీరు అందించే మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులు వేగవంతం చేయాలని మేఘా ఇంజనీరింగ్ సంస్థ ఉపాధ్యక్షుడు, రిటైర్డ్ ఈఎన్‌సీ పొలసాని వెంకటరామారావు సంస్థ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఆయన అశ్వాపురం మండలంలో పర్యటించారు. కుమ్మరిగూడెంలోని దుమ్ముగూడెం ఆనకట్ట నుంచి బీజీ కొత్తూరు వరకు సీతారామ ప్రాజెక్ట్ కెనాల్‌ను పరిశీలించారు. బీజీ కొత్తూరులో పంప్‌హౌస్‌ను సందర్శించారు. అనంతరం సీతారాంపురంలోని మేఘా సంస్థ కార్యాలయంలో జలవనరుల శాఖ అధికారులు, మేఘా సంస్థ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్ట్ ద్వారా అశ్వాపురం మండల రైతులకు సాగునీరు అందించే ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించడం సంతోషకరమని అన్నారు. మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులను వచ్చే జూన్ నాటికి పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జలవనరుల శాఖ ఈఈ వెంకటేశ్వరరావు, డీఈ శ్రీనివాస్, ఏఈ రమేష్, మేఘా సంస్థ జీఎం కేశవస్వామి నాయుడు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బదిలీల ప్రక్రియ

మూడో రోజు 398 మంది ఉపాధ్యాయుల హాజరు..



బల్లలు లేక గోడలపై దరఖాస్తులు నింపుతున్న టీచర్లు

కొత్తగూడెంఅర్బన్: ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ మూడో రోజు సోమవారం కొత్తగూడెంలోని సింగరేణి పాఠశాలలో కొనసాగింది. జిల్లాలోని అన్ని మండలాల నుంచి ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు హాజరై సంబంధిత పత్రాలను వెరిఫికేషన్ చేయించుకున్నారు. అయితే వారు దరఖాస్తులు పూర్తి చేయడం, సర్టిఫికెట్లు సర్దుకునేందుకు తగిన సౌకర్యాలు లేక ఇబ్బంది పడ్డారు. షెడ్యూల్‌లో భాగంగా బయాలజీ ఉపాధ్యాయులు 143 మందికి 125, సోషల్ ఉపాధ్యాయులు 365 మందికి 258 మంది హాజరు కాగా, ఎల్‌ఎఫ్‌ఎల్ వారు 15 మంది.. మొత్తం 398 మంది హాజరయ్యారు. వెరిఫికేషన్ ప్రక్రియ దగ్గర ఎంఈఓలు అందుబాటులో ఉండాలి. కానీ సింగరేణి పాఠశాల వద్ద ఎవరూ లేకపోవడంతో సందేహాల నివృత్తికి ఉపాధ్యాయులకు ఇక్కట్లు తప్పలేదు.



దరఖాస్తుల పరిశీలనకు వేచి ఉన్న ఉపాధ్యాయులు

ఒక కేసు.. అనేక అనుమానాలు

- 2022 జూలైలో ఫిర్యాదు..
- ఎనిమిది నెలల పాటు దర్యాప్తు!
- ఒకే రోజు 14 మంది నిందితుల అరెస్టు
- అదే రోజు న్యాయస్థానంలో హాజరు, రిమాండ్
- ఏ సెక్షన్లు విధించారో వెల్లడించని పోలీసులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఓ వ్యభిచారం వ్యవహారంలో ఐదుగురు నిర్వాహకులు, తొమ్మిది మంది విటుల అరెస్టు.. ఇద్దరు బాలికల సేఫ్ కేసుపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఫిర్యాదు అందినప్పటి నుంచి నిందితుల అరెస్ట్, రిమాండ్ వరకు ప్రతీ దశలో ఏం జరిగిందనే దానిపై అనేక అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి.

గత జూలైలో కేసు నమోదు..

మైనర్ బాలికలను అక్రమంగా వ్యభిచార కూపంలోకి దించుతున్నారని, వారిని కాపాడాలని డీసీపీఓ మట్టా హరికుమారి 2022 జూలై 5న కొత్తగూడెంలోని 3వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు వ్యభిచార గృహం నిర్వహిస్తున్న బానోత్ కరుణ, బోనం రాణితో పాటు వీరికి సహకరిస్తున్న మహమ్మద్ షారుక్‌ఖాన్, మహమ్మద్ అస్గర్ హుస్సేన్, భూక్యా సారయ్యను అరెస్ట్ చేశారు. ఇదే రోజున ఈ వ్యభిచార ముఠాతో సంబంధాలు కొనసాగిస్తూ బాలికలపై లైంగిక దాడికి పాల్పడిన విటులు దండు వెంకటేష్, గుత్తుల ప్రవీణ్, గారుగుల రాజేష్, ఢీకొండ గణేష్, యాసారపు కళ్యాణ్, అంజత్‌ఖాన్, పడిగ ప్రశాంత్, ఢీకొండ శరత్‌నాథ్, షేక్ రషీద్‌లను అరెస్ట్ చేసినట్టు త్రీటౌన్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సోమవారం పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. నిందితులను న్యాయస్థానంలో హాజరు పరిచి, అక్కడి నుంచి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనలో ఇద్దరు మైనర్ బాలికలను రక్షించారు.

సందేహాలెన్నో..

- 2022లో సీడీపీఓ చేసిన ఫిర్యాదు ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారా ? లేదా ?
- సీడీపీఓ ఫిర్యాదులో ఎవరిపై అయినా అనుమానాలు ఉన్నట్టు పేర్కొన్నారా ? పేర్కొంటే ఎవరు ? వారిపై ఏ సెక్షన్ల కింద కేసులు పెట్టారు ?
- నిందితులను పట్టుకున్న 24 గంటల్లోపు న్యాయమూర్తి ఎదుట వారిని ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. దీని ప్రకారం సోమవారం కోర్టులో హాజరు పరిచారు. ఆ లెక్కన వ్యభిచార గృహం ఎక్కడ నిర్వహిస్తున్నారు ? విటులందరూ ఒకే రోజు అక్కడికి వెళ్లారా? సదరు వ్యభిచార కూపంపై ఎప్పుడు దాడి చేశారనే వివరాలపై స్పష్టత లేదు.
- మైనర్ బాలికలపై అత్యాచారం కేసులో నిందితులకు శిక్ష పడాలంటే కచ్చితమైన సాక్ష్యాలు, ఆధారాలు అవసరం. లేదంటే కేసు నిలిచే అవకాశం లేదు. ప్రస్తుతం కేసులో వ్యభిచార కూపం ఎక్కడుంది ? ఎప్పుడు దాడి చేశారు ? నిందితులను ఎలా గుర్తించారు ? వారిని ఎలా పట్టుకున్నారు అనే అంశాలపై స్పష్టత లేదు.
- బాలికలతో వ్యభిచారం నిర్వహిస్తున్నారంటూ 2022 జూలైలో ఫిర్యాదు చేస్తే దాని ఆధారంగా గత ఏడు నెలలుగా కొనసాగిన దర్యాప్తు వివరాలు నామమాత్రంగా కూడా వెల్లడించలేదు.
- మైనర్ బాలికలు ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారా? కాదా? ఒక వేళ వారు ఎస్సీ, ఎస్టీలయితే అందుకు సంబంధించిన చట్టాల ప్రకారం నిందితులపై ఏ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.
- ఏదైనా నేరానికి సంబంధించిన వివరాలు వెల్లడించే క్రమంలో పోలీసులు నిందితుడు ఎక్కడి నివాసి, అతడి వయసు, కులం, వృత్తి వివరాలు వెల్లడించాలి. కానీ ఈ కేసులో అలాంటివేమీ లేవు.
- ఒకే రోజు తొమ్మిది మంది విటులు ఐదుగురు నిర్వాహకులను అరెస్టు చేశారు. ఇంత మంది విటులను అరెస్ట్ చేస్తే ఆ వ్యభిచార గృహం ఏ స్థాయిలో కొనసాగుతోంది. పట్టణంలో ఈ స్థాయిలో వ్యభి చారం జరుగుతుంటే పోలీసులకు ఇంత కాలం తెలియ లేదా ?
- ఈ ఘటనలో కేవలం ఇద్దరు మైనర్ బాలికలు మాత్రమే రక్షించినట్టే చూపించారు. ఈ వ్యభిచార కూపంలో మైనర్లతో పాటు ఇంకా ఎవరైనా బాధిత మహిళలు ఉన్నారా? అనే అంశాలపై స్పష్టత లేదు. ఒక వేళ ఈ ముఠా మైనర్లనే టార్గెట్ చేసి వ్యభిచార రొంపిలోకి దించుతుంటే ఇప్పటి వరకు ఎంత మంది వీరి వలలో చిక్కుకుని బలైపోయారు.
- వ్యభిచార రొంపిలోంచి దించేలా జిల్లాలో మైనర్ బాలికల అక్రమ రవాణా దందా ఏదైనా జరుగుతోందా? ఈ దిశగా ఏమైనా దర్యాప్తు సాగిందా?
- నిందితులంతా పట్టణానికి చెందిన వార్లై, రోజువారి సాధారణ జీవితం గడుపుతున్నా.. వీరిని పట్టుకునేందుకు జిల్లా కేంద్రంలోనే సుమారు ఏడు నెలల సమయం పట్టడం పోలీసు శాఖ పనితీరుపై సందేహాలకు తావిస్తోంది.
- ఈ కేసులో ప్రముఖ రాజకీయ నాయకుల హస్తం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది.

ప్రెస్‌నోట్‌తోనే సరి..

వ్యభిచారం కూపం, మైనర్ బాలికల కేసుకు సంబంధించి ఉదయం నుంచి కొత్తగూడెంలో విపరీతమైన ప్రచారం జరిగింది. ఇద్దరు బాలికలు సేఫ్, 15 మంది నిందితుల అరెస్టు అన్నట్టుగా మెసేజీలు చక్కర్లు కొట్టాయి. చివరకు ఐదుగురు నిర్వాహకులు, తొమ్మిది మంది విటుల అరెస్టును పోలీసులు చూపారు. ఈ కేసుకు సంబంధించి ముందుగా ప్రెస్‌మీట్ ఉంటుందని ప్రచారం జరిగినా.. ఆ తర్వాత చిన్న ప్రెస్‌నోట్‌తో సరిపెట్టడం గమనార్హం.

క్లుప్తంగా

సింగరేణి మణుగూరు జీఎంగా రాంచందర్




జీఎం రాంచందర్

సింగరేణి(కొత్తగూడెం)/మణుగూరుటౌన్: కార్పొరేట్ కాంట్రాక్ట్ మేనేజ్‌మెంట్ కమిటీ (సీఎంసీ) జీఎంగా విధులు నిర్వర్తిస్తున్న దుర్గం రాంచందర్‌ను మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్‌గా నియమిస్తూ సోమవారం రాత్రి సింగరేణి ఎగ్జిక్యూటివ్ ఎస్టాబ్లిస్‌మెంట్ సెల్ జీఎం ఏ.కుమార్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు మణుగూరు జీఎంగా పనిచేసిన జి.వెంకటేశ్వర రెడ్డి ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. దీంతో ఆయన స్థానంలో యాజమాన్యం రాంచందర్‌ను నియమించింది. కార్పొరేట్‌లోని సీపీపీ విభాగంలో పనిచేసే జీఎం చిలుకూరి నర్సింహారావుకు కాంట్రాక్ట్ మేనేజ్‌మెంట్ కమిటీ జీఎంగా పూర్తి బాధ్యతలు ఇవ్వనున్నట్లు యాజమాన్యం ఉత్తర్వుల్లో పేర్కొంది.

సింగరేణి అధికారులు, కార్మికుల హర్షం

సింగరేణి మణుగూరు ఏరియా జీఎం జి.వెంకటేశ్వరరెడ్డి సంస్థ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్‌గా నియమితులవడంపట్ల ఇక్కడి అధికారులు, కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏరియాకు దక్కిన అరుదైన గౌరవమని పేర్కొంటున్నారు. గతంలో కూడా మణుగూరు ఏరియాలో పనిచేసిన అనేక మంది జీఎంలు సింగరేణి డైరెక్టర్లుగా ఎంపికయ్యారు. హంగూ ఆర్భాటాలు లేకుండా నిజాయితీ, నిబద్ధతతో పనిచేసే వ్యక్తికి డైరెక్టర్ హోదా దక్కిందని పేర్కొంటున్నారు. ఈప్రాంతానికి వచ్చిన అనతి కాలంలోనే ఓపెన్‌కాస్టు గనుల్లో రోడ్ల విస్తరణతోపాటు సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించారని కార్మికులు పేర్కొంటున్నారు. కాగా డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి భవిష్యత్‌లో ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని అధికారులు, కార్మికులు కోరుతున్నారు.

కిన్నెరసానిలో తగ్గుతున్న నీటిమట్టం



కిన్నెరసాని జలాశయం

పాల్వంచరూరల్: కిన్నెరసాని జలాశయంతో నీటిమట్టం తగ్గుతోంది. రిజర్వాయర్ నుంచి కేటీపీఎస్, ఇతర పరిశ్రమలకు నీటి అవసరాలు తీర్చడంతోపాటు కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 407 అడుగులు కాగా గతేడాది వర్షాకాలంలో నీటిమట్టం గరిష్టస్థాయికి చేరింది. సోమవారం నాటికి జలాశయంలో నీటిమట్టం 403.50 అడుగులకు తగ్గింది. గతేడాది ఇదే రోజున 404.50 అడుగులు నమోదైంది. ప్రాజెక్టు లాక్‌లకు లీకులు ఏర్పడి నీరు వృథాగా పోతుండటంతో నీటిమట్టం తగ్గుతోందని పలువురు పేర్కొంటున్నారు.

పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్య

దమ్మపేట: పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని సుధాపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మండల పరిధిలోని సుధాపల్లి గ్రామానికి చెందిన సోడెం నాగబాబు (24) తరచుగా మద్యం తాగుతూ ఏ పనీ చేయకుండా తిరుగుతున్నాడు. దీంతో తండ్రి సోడెం వెంకటేశ్వరరావు మందలించగా, మనస్తాపం చెంది ఈ నెల 29వ తేదీన పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు దమ్మపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

న్యాయవాదిపై కేసు నమోదు

పాల్వంచ: పెళ్లి చేసుకుంటానని నమ్మించి సహజీవనం చేసి మహిళను మోసం చేసిన న్యాయవాదిపై పాల్వంచ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. కొత్తగూడేనికి చెందిన న్యాయవాది సాధిక్ పాషా పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన బోగ లక్ష్మిని పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి ఆరేళ్లు సహజీవనం చేశాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే అంతుచూస్తానని బెదిరించి, మరో మహిళను వివాహం చేసుకున్నాడు. ఈ విషయంపై కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

క్రికెటర్ త్రిషకు అభినందనలు

భద్రాచలంఅర్బన్: దక్షిణాఫ్రికాలో జరిగిన వరల్డ్ కప్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఇండియా గెలుపులో కీలకపాత్ర పోషించిన భద్రాచలం పట్టణానికి గొంగడి త్రిషకు నెహ్రూ కప్ క్రికెట్ టోర్నమెంట్ వ్యవస్థాపకులు తోటమల్ల బాలయోగి, వాతాడి దుర్గా అశోక్ అభినందనలు తెలిపారు. సోమవారం భద్రాచలంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. నెహ్రూ కప్ అధ్యక్షులు అట్లూరి శ్రీధర్, ప్రధాన కార్యదర్శి దాట్ల శ్రీనివాసరాజు పాల్గొన్నారు. భద్రాచలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో టీపీసీసీ సభ్యుడు బుడగం శ్రీనివాస్ మాట్లాడుతూ త్రిష ప్రతిభను కొనియాడారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సరెళ్ల నరేష్, గ్రంథాలయ మాజీ చైర్మన్ భోగాల శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ నాయకులు బలుసు సతీష్, వెంకటేష్, రాసమల్ల రాము పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎస్పీఎల్ టోర్నీ

- జూనియర్స్‌లో ఫైనల్స్‌కు చేరిన శ్రీచైతన్య, బొమ్మ జట్లు
- సీనియర్స్ విభాగంలో మొదలైన మ్యాచ్‌లు



సీనియర్స్ విభాగంలో పోటీలను ప్రారంభిస్తున్న యూపీఈ ప్రిన్సిపాల్ రవికుమార్

ఖమ్మం స్పోర్ట్స్: 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యాన సుధాకర్ పైప్స్ అండ్ పైప్స్ అండ్ ఫిట్టింగ్ కంపెనీ సౌజన్యంతో నిర్వహిస్తున్న సాక్షి ప్రీమియర్ లీగ్(ఎస్పీఎల్) క్రికెట్ టోర్నీ నగరంలోని ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల మైదానంలో హోరాహోరీగా సాగుతోంది. మూడో రోజైన సోమవారం జూనియర్ విభాగంలో లీగ్ మ్యాచ్‌లు పూర్తయ్యాయి. ఇక సీనియర్స్ విభాగంలో లీగ్ మ్యాచ్‌లను యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యూకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.రవికుమార్ ప్రారంభించారు. ఈకార్యక్రమంలో సాక్షి బ్రాంచ్ మేనేజర్ గుడిమెట్ల మోహనకృష్ణ, ఈవెంట్ మేనేజర్ బోడపట్ల వేణు, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ రాధారపు రాజుతోపాటు ఉద్యోగులు, సీనియర్ క్రీడాకారులు నెల్లూరి ఉపేందర్, జుజ్జూరు ఉపేందర్, రాంబాబు, శ్రీనివాసాచారి, జోజి చాకో, ఎం.డీ. ఫారుఖ్ తదితరులు పాల్గొన్నారు.

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

ఫైనల్స్ దశకు చేరిన జూనియర్స్ మ్యాచ్‌లు

జూనియర్స్ విభాగానికి సంబంధించి రెండు సెమీస్ సోమవారం జరిగాయి. మొదటి సెమీస్‌లో శ్రీచైతన్య జూనియర్ కళాశాల(ఖమ్మం) – ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల(రుద్రంపూర్) జట్టు తలపడగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీచైతన్య జట్టు పరిమిత ఓవర్లలో 81 పరుగులు చేయగలిగింది. ఈ జట్టులో అవినాష్ 38, విఘ్నేష్ 25 పరుగులు చేశారు. అనంతరం 82 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన పాలిటెక్నిక్ కళాశాల నిర్ణీత ఓవర్లు ఆడి 47 పరుగులు మాత్రమే చేయగలిగింది. దీంతో శ్రీచైతన్య జూనియర్ కళాశాల 35 పరుగుల తేడాతో విజయం సాధించి ఫైనల్స్‌కు చేరింది. అలాగే, రెండో సెమీస్ బొమ్మ డిప్లొమా కాలేజీ(ఖమ్మం)–రెజొనెన్స్ జూనియర్ కళాశాల(మెయిన్ క్యాంపస్) జట్ల నడుమ సాగగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న జట్టు రెజొనెన్స్ జట్టు 71 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన బొమ్మ డిప్లొమా కాలేజీ లక్ష్యాన్ని ను సునాయసనంగా చేధించి ఏడు వికెట్ల తేడాతో గెలవగా ఫైనల్స్‌కు చేరింది. జట్టులో బషీర్ ఆరు ఫోర్లు, ఒక సిక్సర్ సాయంతో 43 వ్యక్తిగత స్కోరు చేసి జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించారు. కాగా, ఉదయం జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ (రుద్రంపూర్) – గౌతమబుద్ధ ఐటీఐ కాలేజీ(ఇల్లెందు) జట్లు తలపడగా టాస్ గెలిచిన గౌతమబుద్ధ జట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు బ్యాటింగ్ అవకాశం ఇచ్చింది. దీంతో ఆ జట్టు నిర్ణీత ఓవర్లలో 77 పరుగులు చేసి ఏడు వికెట్లు కోల్పోగా, ఆతర్వాత బ్యాటింగ్ చేసిన గౌతమబుద్ధ ఐటీఐ కాలేజీ జట్టు 60 పరుగులు మాత్రమే చేయగలగగా, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జట్టు విజయం సాధించి సెమీస్‌కు చేరుకుంది. ఇక ఇంకో క్వార్టర్ ఫైనల్స్‌లో కిట్స్ డిప్లొమా కాలేజీ(ఖమ్మం)–రెజొనెన్స్ జూనియర్ కళాశాల(మెయిన్ క్యాంపస్) జట్లు తలపడ్డాయి. ఇందులో కిట్స్ జట్టు ఏడు వికెట్ల నష్టానికి 63 పరుగులు చేయగా, ఆ తర్వాత బ్యాటింగ్ చేసిన రెజొనెన్స్ జట్టు ఆరు వికెట్లు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని చేధించడంతో సెమీస్‌కు చేరింది. ఈజట్టులో ప్రవీణ్ 31 పరుగులు చేశాడు.

SPL
SAKSHI PREMIER LEAGUE

సీనియర్స్ విభాగంలో రెండు మ్యాచ్‌లు

ఎస్పీఎల్‌లో భాగంగా సీనియర్ విభాగం మ్యాచ్‌లు సాయంత్రం ప్రారంభమయ్యాయి. మొదటి మ్యాచ్‌లో సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల(సత్తుపల్లి) – వివేకవర్ధిని డిగ్రీ కళాశాల(కొత్తగూడెం) జట్లు తలపడగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సాయిస్ఫూర్తి జట్టు పరిమిత ఓవర్లలో 94 పరుగుల భారీ స్కోరు చేసింది. ఆతర్వాత బ్యాటింగ్ చేసిన వివేకవర్ధిని జట్టు నిర్ణీత ఓవర్లలో 55 పరుగులే చేయగలగడంతో ఓటమి పాలు కాగా, సాయిస్ఫూర్తి జట్టుకు గెలుపు దక్కింది. కాగా, ఈ జట్టులో బౌలర్ ప్రకాష్ మూడు వికెట్లు తీసుకుని హ్యాట్రిక్ సాధించగా, నరేంద్ర 25 రన్స్ చేశారు. ఇక అబ్దుల్‌కలాం ఇంజనీరింగ్ కళాశాల(కొత్తగూడెం) – బొమ్మ ఇంజనీరింగ్ కళాశాల(ఖమ్మం) జట్ల నడుమ జరిగిన రెండో మ్యాచ్‌లో టాస్ గెలిచిన అబ్దుల్ కలాం జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. ఈమేరకు బొమ్మ కళాశాల జట్టు పరిమిత ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 60 పరుగులు చేయగా, ఆతర్వాత బ్యాటింగ్‌కు దిగిన అబ్దుల్‌కలాం జట్టు లక్ష్యాన్ని సునాయాసంగా చేధించి ఎనిమిది వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ జట్టులో శ్రీనివాస్ 23 పరుగులు చేశాడు.



సీనియర్స్ విభాగంలో గెలుపొందిన సత్తుపల్లి సాయిస్ఫూర్తి జట్టు

SUDHAKAR
PIPES AND FITTINGS
LEADER IN QUALITY AND TECHNOLOGY
Regional Sponser





జూనియర్స్ విభాగంలో ఫైనల్స్‌కు చేరిన బొమ్మ కళాశాల, శ్రీచైతన్య జూనియర్ కళాశాల జట్లు



43 పరుగులు చేసిన బొమ్మ కాలేజీ క్రీడాకారుడు బషీర్



బౌలింగ్‌లో హ్యాట్రిక్ సాధించిన సాయిస్ఫూర్తి క్రీడాకారుడు ప్రకాష్

మరింత అభివృద్ధికి కృషి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావు



సీతానగరం వద్ద బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న విప్ కాంతారావు

ఆళ్లపల్లి(గుండాల): మారుమూల గిరిజన గ్రామాల రూపు రేఖలు మార్చి, మరింత అభివృద్ధికి కృషి చేస్తానని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు తెలిపారు. సోమవారం ఆళ్లపల్లి మండలంలో ఆయన రూ. 20.02 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ. 7.75 కోట్లతో ఆళ్లపల్లి–వెంకటాపురం బీటీ రోడ్, రూ. 3.50 కోట్లతో పెద్ద వెంకటాపురం వాగు మీద బ్రిడ్జి, రూ. 5.25 కోట్లతో సీతానగరం వాగు మీద బ్రిడ్జి, 4.12 కోట్లతో బోడాయికుంట వాగు మీద చేపట్టే బ్రిడ్జి నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. అనంతరం రూ.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. మామకన్ను ఆశ్రమ పాఠశాల, ఆళ్లపల్లి కేజీబీవీ పాఠశాల, అనంతోగు ఆశ్రమ పాఠశాలలో కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో ముచ్చటించారు. కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మర్కోడు రైతు వేదికలో 14 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ తెలంగాణ సర్కార్ అభివృద్ధిలో దూసుకుపోతోందని అన్నారు. ప్రజలంతా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను విస్మరించొద్దని కోరారు. ఈ కార్యక్రమంలో ఆళ్లపల్లి ఎంపీపీ కోండ్రు మంజుభార్గవి, జెడ్పీటీసీ కొమురం హనుమంతరావు, సొసైటీ చైర్మన్ గొగ్గెల రామయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, ఆర్‌అండ్‌బీ డీఈ వెంకటేశ్వరరావు, పీఆర్ డీఈ సైదులు రెడ్డి, ఏఈలు అఖిల్, మోతీలాల్, టేకులపల్లి సీఐ ఇంద్రసేనారెడ్డి, ఆళ్లపల్లి ఎస్‌ఐ రతీష్, టీఆర్‌ఎస్ మండల నాయకులు పాయం నర్సింహారావు, బాబా, ఆసీఫ్, ఆతహార్, ఖయ్యూం, కొమరం వెంకటేశ్వర్లు, వెంకన్న, తెల్లం భాస్కర్, అజ్జు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి చినమేడారం జాతర

నాలుగు రోజులపాటు ఘనంగా ఉత్సవాలు



దుమ్ముగూడెం: మారాయిగూడెంలో సమ్మక్క–సారలమ్మ గద్దెలు



చర్ల: ముస్తాబైన అమ్మవార్ల దేవాలయం

చర్ల: చినమేడారంగా పేరుగాంచిన ఎదిరగుట్టల సమ్మక్క సారలమ్మ జాతర నేడు ప్రారంభం కానుంది. రెండేళ్లకోసారి నాలుగు రోజులపాటు జరిగే ఈ వేడుక మంగళవారం నుంచి ఫిబ్రవరి 3 వరకు సాగనుంది. భక్తులు అధిక తరలివచ్చే అవకాశం ఉండటంతో ఉత్సవ కమిటీ, గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. తాగునీరు, విద్యుద్దీపాలు, పారిశుద్ధ్యం, చలువపందిళ్ల నిర్మాణం చేపట్టారు. 2021లో జరిగిన జాతరకు కరోనా నేపథ్యంలో భక్తులకు పెద్దగా రాలేదు. కానీ ఈసారి పెరిగే అవకాశం ఉంది. రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాలతోపాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలోని బీజాపూర్, దంతెవాడ, సుకుమా, గడ్చిరోలి జిల్లాల ఆదివాసీలు జాతరకు తరలిరానున్నారు. మంగళవారం సాయంత్రం ఎదిరగుట్టల సమీపంలోని అబ్బరాశిబండల వద్ద ఉన్న నాగులమ్మగుడిలో ఉండే పూజా సామగ్రిని పూజారి పూనెం సమ్మయ్య నేతృత్వంలో శుద్ధి చేసి కొమ్ము ఊది అంకురార్పణ చేయడంతో జాతర ప్రారంభమవుతుంది.

మారాయిగూడెం జాతర..

దుమ్ముగూడెం: మండలంలోని మారాయిగూడెం గ్రామంలో కొలువై ఉన శ్రీ సమ్మక్క–సారలమ్మ చిన్న జాతర నేటి నుంచి ప్రారంభం కానుంది. ఈ నెల 31వ తేదీ నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు దేవర బాలలుగా సోడి శాంతమ్మ, అచ్చమ్మ వ్యవహరిస్తూ జాతరను అంగరంగవైభవంగా నిర్వహించనున్నారు. మంగళవారం మండమెలుగుటతో ప్రారంభమయ్యే జాతర ఫిబ్రవరి 3న సమ్మక్క, సారలమ్మలకు మొక్కుబడులు చెల్లించడంతో ముగుస్తుంది.

ఎమ్మెల్యే లేదా ఎంపీగా పోటీ చేస్తా..

మాజీ ఎంపీ సీతారాం నాయక్



మాట్లాడుతున్న మాజీ ఎంపీ సీతారాం నాయక్

టేకులపల్లి: తెలంగాణ ఉద్యమ సమయంలో 2014లో ఎంపీగా గెలిచానని, ఆ తర్వాత రాజకీయ సమీకరణల నేపథ్యంలో తనకు అవకాశం లభించలేదని మాజీ ఎంపీ ప్రొఫెసర్ అజ్మీర సీతారాం నాయక్ అన్నారు. ప్రస్తుతం కేసీఆర్ నుంచి తనకు అండదండలు ఉన్నాయని, వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే లేదా ఎంపీగా.. కేసీఆర్ ఏది ఇస్తే దాంట్లో పోటీ చేస్తానని పేర్కొన్నారు. సోమవారం ఆయన ఎమ్మెల్యే హరిప్రియ, ఏఎంసీ చైర్మన్ హరిసింగ్ నాయక్‌తో కలిసి టేకులపల్లిలోని ఎమ్మెల్యే నివాసంలో విలేకరులతో మాట్లాడారు. దేశానికి కేసీఆర్ లాంటి నాయకుడు చాలా అవసరమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ స్వయంకృతాపరాధంతో బలహీనపడుతుండటం, బీజేపీ ప్రైవేటీకరణతోపాటు దేశంలో సంక్షోభాలు సృష్టించిందని, ఆ రెండు పార్టీల వైఫల్యాల వల్లే బీఆర్‌ఎస్ పుట్టిందని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఎవరూ తొందరపడొద్దని, సహనంతో పార్టీని నమ్ముకున్న వారికి తప్పకుండా న్యాయం జరుగుతుందని తెలిపారు. కోరం కనకయ్య ఎమ్మెల్యేగా ఓడిపోతే పార్టీ జెడ్పీటీసీగా గెలిపించి జెడ్పీ చైర్మన్ పదవిలో కూర్చొబెట్టిందని గుర్తుచేశారు. కాగా అత్యవసర పరిస్థితుల్లో రక్తం దొరక్క పలువురు మృత్యువాత పడుతున్నారని, ఇల్లెందులో రక్త నిల్వలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు సూచించారు.



పొత్తులున్నా లేకున్నా..

- భద్రాచలంలో సీపీఎం పోటీ ఖాయం
- పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు పోతినేని, మాజీ ఎంపీ మిడియం



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

భద్రాచలంఅర్బన్: పొత్తులున్నా లేకున్నా భద్రాచలంలో సీపీఎం పోటీ చేస్తుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ రావు, మాజీ ఎంపీ మిడియం బాబూరావు పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో కమ్యూనిస్టులకు నామినేటెడ్ పోస్టులు ఇస్తే సరిపోతుందంటూ కమ్యూనిస్టులను చులకన చేస్తూ బీఆర్‌ఎస్ విప్ రేగా కాంతారావు మాట్లాడటాన్ని వారు తీవ్రంగా ఖండించారు. పొత్తులు ఖరారైనట్లు మాట్లాడడం అసత్యంతో అసందర్భమని పేర్కొన్నారు. పార్టీ నాయకుడు ఎండీ నర్సారెడ్డి అధ్యక్షతన సోమవారం భద్రాచలం పట్టణంలో జరిగిన సీపీఎం పట్టణ స్థాయి జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడారు. మతతత్వ శక్తులకు అవకాశం లేకుండా చూడాల్సిన బాధ్యత కమ్యూనిస్టులదేనని పేర్కొన్నారు. మత ప్రాతిపదికన ప్రజలను చీల్చేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. బీజేపీని నిలువరించే క్రమంలోనే బీఆర్‌ఎస్‌తో కలిసి పనిచేసేందుకు సీపీఎం సిద్ధమైందని, ఈ విషయం అర్థం చేసుకోలేని రేగా కాంతారావు అసంబద్ధ వ్యాఖ్యలు చేయడం సరికాదని పేర్కొన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, నాయకులు బండారు రవికుమార్, మచ్చ వెంకటేశ్వర్లు, గడ్డంస్వామి, ఎం.రేణుక, సున్నం గంగ, బండారు శరత్ బాబు, వై.వెంకటరామారావు, పి.సంతోష్ కుమార్, ఎస్ లీలావతి, బి.కుసుమ, డి. లక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.

ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన పరితోష్



ఏఎస్పీ రోహిత్ రాజ్ నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న పరితోష్ పంకజ్

భద్రాచలం అర్బన్: భద్రాచలం ఏఎస్పీగా పరితోష్ పంకజ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసి, బదిలీపై హైదరాబాద్ గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్‌గా వెళ్తున్న బి.రోహిత్‌రాజ్ ఏఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు అప్పగించారు. తొలుత పరితోష్ పంకజ్ శ్రీసీతారామచంద్ర స్వామి వారిని దర్శించుకున్నారు. బాధ్యతలు చేపట్టాక ఆయన మాట్లాడుతూ నిషేధిత వస్తువుల రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. శాంతి భద్రతలే లక్ష్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు.

మెడికోలకు ఈ-పాస్ టెన్షన్..

నేటితో ముగియనున్న స్కాలర్‌షిప్ గడువు



కొత్తగూడెం మెడికల్ కళాశాల

చుంచుపల్లి: కొత్తగూడెం మెడికల్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు స్కాలర్‌షిప్ టెన్షన్ పట్టుకుంది. ప్రభుత్వం తొలి ఏడాదిలో అర్హత గలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగ విద్యార్థులు పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం ఆన్‌లైన్‌లో ఈ–పాస్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 31 వరకు గడువు విధించింది. కొత్తగా ఏర్పడిన మెడికల్ కళాశాల కావడంతో విద్యార్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, కళాశాలకు సంబంధించిన విద్యార్థుల వివరాలు ఇంకా వెబ్ సైట్ పోర్టల్‌లోకి చేరలేదని సమాచారం. మెడికల్ కళాశాలలో 149 మంది విద్యార్థులు మొదటి సంవత్సరంలో చేరారు. వీరికి గతేడాది నవంబర్ 15 నుంచి తరగతులు ప్రారంభమయ్యాయి. వీరి వివరాలను ఇప్పటికే కళాశాలతో పాటు వివిధ వెల్ఫేర్ శాఖలు హైదరాబాద్ కమిషనర్ పరిధికి పంపాయి. వీటి విషయంలో అక్కడి నుంచి అనుమతితో కాలేజీ కోడ్ రావాల్సి ఉంది. ఈ ప్రక్రియ ఆలస్యం కావడంతో స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకునే వెబ్ వర్షన్‌లో తమ పేర్లు ఓపెన్ కావడం లేదని విద్యార్థులు చెబుతున్నారు. దీంతో పది రోజులుగా మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ చదువుతూ స్కాలర్‌షిప్‌నకు అర్హులైన విద్యార్థులు టీఎస్ ఈ–పాస్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు ఎదురు చూస్తున్నారు. ప్రతిరోజు మీ సేవ కేంద్రాలకు వెళ్లి వైబ్‌సైట్ ఓపెన్ కాకపోవడంతో నిరాశగా వెనుదిరిగి వస్తున్నారు. ఎప్పుడు వెబ్‌సైట్ ఓపెన్ అవుతుందో తెలియని పరిస్థితి నెలకొందని విద్యార్థులు వాపోతున్నారు. యూనివర్సిటీ నుంచి పేర్లు అప్లోడ్ చేస్తే తప్ప స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకునే వీలుండదని చెబుతున్నారు. మంగళవారమే చివరి గడువు కావడంతో విద్యార్థులు ఒకింత ఆందోళన చెందుతున్నారు. కొత్తగా ప్రారంభించిన మెడికల్ కళాశాల కావడంతోనే కొంత జాప్యం జరుగుతోందని సిబ్బంది తెలుపుతున్నారు. రెండు మూడు రోజుల్లో దీని విషయంలో గ్రీన్ సిగ్నల్ వస్తుందని, స్కాలర్‌షిప్ దరఖాస్తు గడువు సైతం పొడిగించే అవకాశం ఉందని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణరావు తెలిపారు. విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు.

పొట్టకూటి కోసం వెళ్లి మృత్యువాత

- తల్లిదండ్రులకు అనారోగ్యం
- కుటుంబ పరిస్థితి అగమ్యగోచరం



రాంబాబు(ఫైల్)

అశ్వారావుపేటరూరల్: పొట్టకూటి కోసం కూలి పనికి వెళ్లి ఓ వ్యక్తి చింత చెట్టు విరిగి పడి మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని వేదాంతపురం గ్రామానికి చెందిన కొండపర్తి రాంబాబు(35) వడ్రంగి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నేపథ్యంలోనే సోమవారం ఏపీలోని ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండలం మంగాలపేట గ్రామానికి పనికి వెళ్లాడు. పని చేసి విశ్రాంతి సమయంలో తోటి కూలీలతో మాట్లాడుతుండగా, ఒక్కసారిగా పెద్ద శబ్దం రాగా బయటకు వెళ్లాడు. అదే సమయంలో అక్కడ ఉన్న శతాబ్దాల కాలం నాటి పెద్ద చింత చెట్టు కూప్పకూలింది. ఓ పెద్ద కొమ్మ రాంబాబు మీద పడగా తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు అక్కడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే పరిస్థితి విషమించి మృతి చెందాడు. కాగా మృతుడి తండ్రి నాగేశ్వరరావు పక్షవాతం కారణంగా మంచానికే పరిమితం కాగా, 70 ఏళ్ల తల్లి దుర్గమ్మ అనారోగ్యంతో బాధ పడుతోంది. మృతుడి భార్య నాగవల్లి గృహిణి కాగా, పదేళ్లలోపు వయసు ఉన్న ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరందరినీ రాంబాబు కూలి పనులకు వెళ్లి పోషిస్తున్నాడు. ఆయన అకాల మృతితో కుటుంబం పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

తెర్రెం ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న మహిళా మావోయిస్టు అరెస్టు

చర్ల: తెర్రెంలో 2021లో జరిగిన అతిపెద్ద ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న ఒక మహిళా మావోయిస్టును ఆదివారం రాత్రి రాయ్‌పూర్‌కు చెందిన ఎన్‌ఐఏ అధికారులు అరెస్టు చేశారు. మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, ఒకటో ప్లాటూన్ సెక్షన్ కమాండర్ మడవి హిడ్మా నేతృత్వాన 2021 ఏప్రిల్ 4న ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా తెర్రెం పోలీస్ స్టేషన్ పరిధి టేకులగూడెం–జొన్నగూడ అటవీ ప్రాంతాల్లో మాటు వేసిన మావోయిస్టులు పక్కా పథకం ప్రకారం పోలీసు బలగాలను రప్పించి మందుపాతరలను పేల్చడంతో పాటు రాకెట్ లాంఛర్లతో దాడి చేశారు. ఈ ఘటనలో 22 మంది జవాన్లు మృతిచెందగా, 31 మంది తీవ్రంగా గాయపడ్డారు. అలాగే, కోబ్రా విభాగం జవాన్ ఒకరిని మావోయిస్టులు పట్టుకెళ్లి ఐదు రోజుల తరువాత విడిచిపెట్టారు. ఈ ఘటన అప్పట్లో ఇరు రాష్ట్రాల పోలీసు యంత్రాంగాన్ని ఆందోళనకు గురి చేసింది. ఈ ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న మావోయిస్టుల్లో పలువురిని గతంలోనే అరెస్టు చేయగా, తాజాగా ఆదివారం రాత్రి బీజాపూర్ జిల్లాలోని భూపాలపట్నం సమీపాన మహిళా మావోయిస్టు మడకం ఉంగిని అరెస్టు చేశారు. ఉంగి స్వగ్రామం బీజాపూర్ జిల్లా ఉడతమల్ల కాగా, ఈమె పదేళ్లుగా మావోయిస్టు పార్టీలో పని చేస్తున్నట్లు తెలిసింది. ఉంగిని ఎన్‌ఐఏ అధికారులు సోమవారం కోర్టులో హాజరుపరిచారు.

6న రాష్ట్ర బడ్జెట్

ఫిబ్రవరి 3 నుంచే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం

- 4న గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై చర్చ
- సభను ప్రోరోగ్ చేసి నేడు మరో నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం
- రాజ్‌భవన్‌కు శాసనసభ వ్యవహారాల మంత్రి వేముల
- గవర్నర్ తమిళిసైతో భేటీ అనంతరం తిరిగి ప్రగతిభవన్‌కు..
- శరవేగంగా పరిణామాలు

సాక్షి, హైదరాబాద్: ఫిబ్రవరి 3న ప్రారంభయ్యే అసెంబ్లీ సమావేశాలను గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రసంగంతో మొదలుపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 6న ఉదయం 10.30 గంటలకు ఉభయసభల్లో బడ్జెట్ ప్రవేశపెట్టనుండగా, 8 నుంచి బడ్జెట్‌పై చర్చ నిర్వహించనున్నారు. రాష్ట్ర బడ్జెట్ అంశంపై ప్రభుత్వం, గవర్నర్ నడుమ తలెత్తిన సందిగ్ధత హైకోర్టు వేదికగా తెరపడటంతో ప్రభుత్వం ఈమేరకు నిర్ణయం తీసుకుంది. గవర్నర్ బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు ఆమోదం తెలపలేదంటూ సోమవారం హైకోర్టును ఆశ్రయించిన ప్రభుత్వం కొద్ది గంటల్లోనే పిటిషన్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించింది. ఉభయ సభలనుద్దేశించి చేసే గవర్నర్ ప్రసంగానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. దీంతో బడ్జెట్ సమావేశాల నిర్వహణకు సంబంధించి సోమవారం రాత్రి వరకు పలు పరిణామాలు వేగంగా చోటు చేసుకున్నాయి.

గవర్నర్ వద్దకు మంత్రి వేముల

అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై సందిగ్ధత తొలగడంతో ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, న్యాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితోపాటు ఆర్థిక శాఖ అధికారులు, అసెంబ్లీ కార్యదర్శి ఈ భేటీలో పాల్గొన్నారు. అసెంబ్లీ సమావేశాల షెడ్యూల్లో మార్పులు చేస్తూ నోటిఫికేషన్, గవర్నర్ ప్రసంగంలో ఉండాల్సిన అంశాలు, గవర్నర్ వద్ద పెండింగులో బిల్లులు తదితరాల గురించి చర్చించినట్లు సమాచారం. గవర్నర్ ప్రసంగంలో ఉండాల్సిన అంశాలపైనా కసరత్తు జరిగినట్లు తెలిసింది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ నర్సింహాచార్యులు సాయంత్రం రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ తమిళిసైతో భేటీ అయ్యారు. ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించాల్సిందిగా గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను వేముల ప్రశాంత్‌రెడ్డి ఆహ్వానించారు. బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు సమ్మతి తెలపడంతోపాటు ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించేందుకు గవర్నర్ అంగీకరించినట్లు తెలిసింది. గవర్నర్ ప్రసంగంలో ఉండే అంశాలపైనా సూచన ప్రాయంగా గవర్నర్‌కు వివరించినట్లు సమాచారం. అనంతరం వేముల ప్రగతిభవన్‌కు వెళ్లి సీఎం కేసీఆర్‌కు ఈ వివరాలు చెప్పినట్లు తెలిసింది.

ప్రోరోగ్ చేసి మరో నోటిఫికేషన్?

ఫిబ్రవరి 3న మధ్యాహ్నం 12.10 గంటలకు శాసనసభ, శాసన మండలి వేర్వేరుగా సమావేశమవుతాయని ఈ నెల 21న అసెంబ్లీ కార్యదర్శి నోటిఫికేషన్లు జారీ చేసిన విషయం తెలిసిందే. గవర్నర్ ప్రసంగం లేకుండానే అసెంబ్లీ సమావేశాలు జరుగుతాయని భావించగా, 3న ఉభయ సభల్లో బడ్జెట్ ప్రవేశపెడతారనే సంకేతాలు వెలువడ్డాయి. తాజా పరిణామాలతో అసెంబ్లీ నిర్వహణ షెడ్యూల్లో కొన్ని మార్పులు జరగనున్నాయి. 2021 సెప్టెంబర్ నుంచి అసెంబ్లీ ప్రోరోగ్ కాకుండానే సమావేశమవుతూ వస్తోంది. ప్రస్తుతం ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించనుండటంతో వెంటనే అసెంబ్లీని ప్రోరోగ్ చేసి మరో నోటిఫికేషన్‌ను శాసనసభ కార్యదర్శి ఇచ్చే అవకాశముంది. మంగళవారం సాయంత్రంలోగా నోటిఫికేషన్ వెలువడే అవకాశముంది. కాగా, 4వ తేదీన గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదం తెలిపే తీర్మానంపై చర్చ, ముఖ్యమంత్రి సమాధానం ఉంటాయి.

విషమంగానే తారకరత్న ఆరోగ్యం

ఎక్మో కాదు.. వెంటిలేటర్‌తో చికిత్స



బనశంకరి: నాలుగు రోజుల కిందట గుండెపోటుకు గురై బెంగళూరులోని నారాయణ హృదయాలయ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తెలుగు నటుడు నందమూరి తారకరత్న పరిస్థితి ఇంకా విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు. ఆయన ప్రస్తుతం వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నట్లు సోమవారం సాయంత్రం విడుదల చేసిన హెల్త్ బులెటిన్‌లో వైద్యులు పేర్కొన్నారు. తారకరత్నకు ఎక్మో సపోర్ట్ ఇవ్వలేదని, అత్యాధునిక వైద్యపరికరాలతో చికిత్స అందిస్తున్నామని తెలిపారు. సోమవారం నిర్వహించిన వైద్యపరీక్షలపై వివరాలు వెల్లడించలేదు. ఆస్పత్రి వద్దకు అభిమానులు, కార్యకర్తలు తరలిరావడంతో పోలీసులు పటిష్ట భద్రత కల్పించారు. నిమ్హాన్స్ న్యూరోసర్జన్ డాక్టర్ గిరీశ్ కులకర్ణి నేతృత్వంలో ఇద్దరు న్యూరోసర్జన్లు, నారాయణ హృదయాలయకు చెందిన ఎనిమిదిమందికిపైగా వైద్యనిపుణులు తారకరత్నకు చికిత్స చేస్తున్నారు.

భూపాలపల్లిలో 'డబుల్' పోరాటం

ఇళ్లను ఆక్రమించేందుకు నిరుపేదలతో కలిసి వెళ్లిన రిటైర్డ్ కలెక్టర్ మురళి



పోలీస్‌స్టేషన్‌లో మహిళలతో బైఠాయించిన ఆకునూరి మురళి

భూపాలపల్లి: డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఏళ్లు గడుస్తున్నా ఇంకా పంపిణీ చేయడంలేదంటూ నిరుపేదలు ఆక్రమణ బాటపట్టారు. రిటైర్డ్ కలెక్టర్ ఆకునూరి మురళి నాయకత్వంలో ఇళ్లను ఆక్రమించేందుకు యత్నించగా పోలీసులు అడ్డు కొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లిలో సోమవారం జరిగింది. అప్పటి ఎమ్మెల్యే ఎస్.మధుసూదనాచారి, అప్పటి కలెక్టర్ ఆకునూరి మురళి ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో 2017–18లో 544 డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించారు. 2020లో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మరో 420 ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించగా అవి కూడా చివరిదశకు చేరాయి. ఇళ్లను కేటాయించాలని మహిళలు డిసెంబర్ 28 నుంచి వారంపాటు నిరాహారదీక్ష చేపట్టారు. పోలీసులు దాడి చేసి దీక్షాశిబిరాన్ని తొలగించడంతో ఈ నెల 6న ఆకునూరి మురళిని మహిళలు కలిసి మద్దతు కోరారు. అదేరోజున కలెక్టర్ భవేష్‌మిశ్రాకు వినతిపత్రం అందజేయగా నెలలోపు ఇళ్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అయితే ఆ గడువు ముగిసినా ఇళ్లను కేటాయించకపోవడంతో ఆందోళనకు దిగారు. పోలీస్ స్టేషన్‌లోనే ఉదయం నుంచి సాయంత్రం వరకు మురళితోపాటు 100 మంది మహిళలు బైఠాయించారు. తహసీల్దార్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడించారు. ఫిబ్రవరి 4న ఇళ్లు కేటాయిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

కేబుల్ ఆపరేటర్ల వ్యవస్థను దెబ్బతీసేందుకు కేంద్రం కుట్ర

మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆరోపణ



మహాధర్నాలో అభివాదం చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

కవాడిగూడ: కేబుల్ ఆపరేటర్ల వ్యవస్థను దెబ్బతీసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఎన్‌టీవో జీఓ–3ను రద్దు చేసే వరకు ఢిల్లీ కేంద్రంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. ట్రాయ్ అసంబద్ధ విధానాలను వ్యతిరేకిస్తూ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల కేబుల్ ఆపరేటర్ల జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య హాజరై సంఘీభావం తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రజలను చైతన్యవంతులుగా చేసిన చరిత్ర కేబుల్ ఆపరేటర్ వ్యవస్థదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీలకు అప్పగిస్తోందని ఆరోపించారు. కేబుల్ ఆపరేటర్ల సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా కేబుల్ ఆపరేటర్లకు గుర్తింపు కార్డులు ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు. కేబుల్ ఆపరేటర్లపై ట్రాయ్ పెత్తనాన్ని అధిగమించేందుకు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న కేబుల్ ఆపరేటర్లు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జేఏసీ కన్వీనర్ పమ్మి సురేష్, ప్రధాన కార్యదర్శి కిశోర్‌లతో పాటు సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల అమలు ఎలా ఉంది?

- న్యూఢిల్లీ డిఫెన్స్ కళాశాల అధికారుల ప్రత్యక్ష పరిశీలన
- సిద్దిపేట జిల్లాలో పర్యటించిన బృందం



గజ్వేల్‌లోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో కూరగాయల వ్యాపారులతో మాట్లాడుతున్న డిఫెన్స్ కళాశాల అధికారులు

గజ్వేల్: తెలంగాణలో ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి తీరును పరిశీలించేందుకు న్యూఢిల్లీకి చెందిన డిఫెన్స్ కళాశాల అధికారుల బృందం 'నేషనల్ సెక్యూరిటీ అండ్ స్ట్రాటజిక్ స్టడీస్' పేరిట చేపట్టిన ఐదు రోజుల అధ్యయన యాత్ర సోమవారం సిద్దిపేట జిల్లాలో ప్రారంభమైంది. కళాశాలకు చెందిన ఫ్యాకల్టీ ఇన్‌చార్జ్ ప్రియాంక్ భర్తీతోపాటు 18మంది అధికారులు, వివిధ దేశాల ప్రతినిధులు కూడా బృందంలో ఉన్నారు. ముందుగా సీఎం కేసీఆర్ ప్రాతినిథ్యం వహిస్తున్న గజ్వేల్‌కు వారు చేరుకున్నారు. వారికి జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారికి 'మిషన్ భగీరథ'పథకం అమలు తీరుతెన్నులను కలెక్టర్‌తోపాటు ఈ పథకం ఈఈ రాజయ్యలు వివరించారు. నీటిలో ఫ్లోరైడ్ కారణంగా నల్లగొండ జిల్లాలో ప్రజలు అంగవైకల్యంలో నానా ఇక్కట్లు పడేవారని ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని వారికి వివరించారు. ఆ తర్వాత హరితహారం కార్యక్రమం ద్వారా జిల్లాలో వచ్చిన ఫలితాలను, కంటివెలుగు పథకం తీరుతెన్నులను కలెక్టర్, జిల్లా అటవీశాఖాధికారి శ్రీనివాస్, జిల్లా వైద్యాధికారి కాశీనాథ్ బృందం సభ్యులకు వివరించారు.

ప్రత్యక్ష పరిశీలనలతో బిజీబిజీ

పథకాలకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకున్నాక డిఫెన్స్ కళాశాల అధికారులు కేజీ టూ పీజీ విద్యను అందిస్తున్న గజ్వేల్‌లోని ఎడ్యుకేషన్ హబ్, ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్, మల్లన్నసాగర్ సందర్శనలతో బిజీబిజీగా గడిపారు. ఐదురోజులపాటు జరగనున్న ప్రత్యక్ష పరిశీలన, అధ్యయనం వివరాలను కేంద్రానికి నివేదిక రూపంలో అందజేస్తామని డిఫెన్స్ కళాశాల అధికారులు తెలిపారు. కార్యక్రమంలో 'గడా' (గజ్వేల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ షోరూంలో రైతు ఆత్మహత్యాయత్నం

కామారెడ్డి క్రైం: రైతు వద్ద నుంచి సెకండ్ సేల్ కింద కొన్న ట్రాక్టర్‌కు సంబంధించిన డబ్బులు ట్రాక్టర్ షోరూం మేనేజర్ ఇవ్వకపోవడంతో బాధితుడు షోరూంలోనే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సిరిసిల్ల రోడ్డులో సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. బాధితుడు, అతని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి మండలం క్యాసంపల్లి తండాకు చెందిన అంగోత్ ప్రకాశ్ ఏడాది క్రితం జిల్లా కేంద్రంలోని స్వరాజ్ షోరూంలో తన ట్రాక్టర్‌ను సెకండ్ సేల్ కింద విక్రయించాడు. షోరూం మేనేజర్ ట్రాక్టర్‌కు 3.50 లక్షలకు ధర నిర్ణయించి అడ్వాన్సుగా రూ. 50 వేలు ఇచ్చారు. మిగతా డబ్బులు ఇవ్వకుండా ఏడాది నుంచి రేపుమాపు అంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. అయితే సోమవారం షోరూంకు వెళ్లిన ప్రకాశ్ మేనేజర్‌తో మాట్లాడినా డబ్బులు ఇవ్వకపోవడంతో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. దాంతో భయాందోళనకు గురైన షోరూం సిబ్బంది పోలీసులకు సమాచారమివ్వగా ప్రకాశ్‌ను జిల్లా ఆస్పత్రికి తరలించారు. జిల్లా అదనపు సివిల్ కోర్టు న్యాయమూర్తి ఆస్పత్రికి వచ్చి బాధితుని స్టేట్మెంట్ తీసుకున్నారు. బాధితునికి 40 శాతం గాయాలయ్యాయని, మెరుగైన చికిత్స కోసం గాంధీ లేదా ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. తమకు న్యాయం చేయాలని బాధితుని కుటుంబ సభ్యులు వేడుకున్నారు. ఘటన అనంతరం షోరూంకు నిర్వాహకులు తాళం వేశారు. ఫోన్లో సంప్రదించగా ఎవరూ అందుబాటులోకి రాలేదు.

జిల్లా వార్తలు

రేపు మంత్రులు సింగిరెడ్డి, పువ్వాడ పర్యటన

ఖమ్మంవ్యవసాయం: రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో కలిసి బుధవారం ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు ముదిగొండ మండలం మాధారంలో నిర్మించిన రైతు వేదికను మంత్రులు ప్రారంభించి అక్కడ ఏర్పాటుచేసిన రైతు సదస్సులో పాల్గొంటారు. అనంతరం ఖమ్మం చేరుకుని మధ్యాహ్నం 3 గంటలకు మార్కెట్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రులు పాల్గొననున్నారు.

యూత్ పార్లమెంట్‌కు ఇద్దరి ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా నెహ్రూ యువక కేంద్ర ఆధ్వర్యంలో సోమవారం యూత్ పార్లమెంట్ కోసం ఆన్‌లైన్‌లో ఎంపికలు నిర్వహించారు. ఈమేరకు ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరు ఎంపికయ్యారని జిల్లా కోఆర్డినేటర్ అన్వేష్ తెలిపారు. ఈ సందర్భంగా కనకపూడి అఖిల(ఖమ్మం), యాడ లావణ్య(భద్రాద్రి కొత్తగూడెం) ఎంపిక కాగా, ఈ ప్రక్రియలో భానుచందర్, నూకల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు పత్తి, అపరాల యార్డులకు సెలవు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ విజ్ఞప్తి మేరకు బుధవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లోని పత్తి, అపరాల యార్డులకు సెలవు ప్రకటించారు. ఈమేరకు మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షల మల్లేశం ఓ ప్రకటనలో వెల్లడించారు. అయితే, మిర్చి కొనుగోళ్లు మాత్రం యథాతథంగా కొనసాగుతాయని తెలిపారు. ఇక గురువారం మార్కెట్‌లోని అన్ని యార్డుల్లో కొనుగోళ్లు ఉంటాయని పేర్కొన్నారు.

10లోగా పరీక్ష ఫీజు చెల్లించండి

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీలో పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలు పొందిన అభ్యర్థులు ఫిబ్రవరి 1నుంచి 10వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈఓ సోమశేఖరశర్మ, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిలా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు సూచించారు. పదో తరగతి అభ్యర్థులు థియరీ సబ్జెక్ట్, ప్రాక్టికల్ సబ్జెక్ట్‌లకు రూ.100 చొప్పున, ఇంటర్ అభ్యర్థులు రూ.150 చొప్పున మీసేవ, టీఎస్ ఆన్‌లైన్, ఓపెన్ స్కూల్ వెబ్‌సైట్ల ద్వారా ఫీజు చెల్లించాలని తెలిపారు. కాగా, సబ్జెక్ట్‌కు రూ.25 చొప్పున అపరాధ రుసుంతో ఫిబ్రవరి 11నుంచి 16వరకు, రూ.50చొప్పున అపరాధ రుసుంతో 22వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చని వెల్లడించారు.

మిర్చి వ్యాపారుల దందా

- విక్రయాలు పెరుగుతుండగా తగ్గుతున్న ధర
- 20 రోజుల్లో రూ.2 వేలకు పైగా పడిపోయిన వైనం
- సిండికేట్‌గా మారిన వ్యాపారుల మాయాజాలం



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన మిర్చి

ఖమ్మంవ్యవసాయం: రైతుల అవసరాలను తమకు అనుకూలంగా మలుచుకుంటున్న వ్యాపారులు మిర్చి ధర తగ్గించి సొమ్ము చేసుకుంటున్నారు. మిర్చికి పెట్టుబడులు పెరుగుతుండడం, సాగుకు అప్పులు చేయాల్సి ఉండడంతో రైతులు పంట చేతికి రాగానే అమ్మేందుకు మొగ్గు చూపుతారు. దీనిని ఆసరాగా తీసుకున్న వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ధర తగ్గిస్తుండడం రైతులకు కన్నీరు మిగులుస్తోంది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు రోజురోజుకు పెద్దసంఖ్యలో రైతులు మిర్చి తీసుకొస్తున్నారు. ఈనేపథ్యాన శుక్రవారం క్వింటాకు రూ.19,100 పలికిన ధర సోమవారం రూ.18,700కు పడిపోయింది. అంటే క్వింటాకు ఏకంగా రూ.400 మేర ధర తగ్గింది. ఇక ఇరవై రోజుల ధరతో పోలిస్తే ఏకంగా రూ.2 వేల మేర తగ్గడం గమనార్హం.

ఈనెలలో మిర్చి ధరలు (క్వింటాకు రూ.ల్లో)

తేదీ	ధర
జనవరి 5	21,050
11న	21,000
12న	20,000
20న	19,800
24న	19,500
27న	19,100
30న	18,700

అంతా ఏకమై దోపిడీ

జిల్లాలో పండించే తేజ రకం మిర్చికి దేశ, విదేశాల్లో డిమాండ్ ఉంటుంది. చైనా, మలేషియా, థాయిలాండ్, బంగ్లాదేశ్ తదితర దేశాల నుంచి వ్యాపారులకు ఆర్డర్లు వస్తాయి. ఈ సమయాన వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ధర తగ్గిస్తున్నారు. అదేమంటే మిర్చికి ప్రభుత్వ మద్దతు ధర లేదు, దేశ, విదేశాల్లో మార్కెట్ ధరలు ఇలాగే ఉన్నాయని నమ్మబలుకుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. అయితే, పంట విక్రయాలు పెరిగిన సమయాన ధర తగ్గిస్తున్న వ్యాపారులు పంటను నిల్వ చేసుకుంటున్నట్లు సమాచారం. క్వింటా మిర్చిని రూ.15 వేలకు అటూ ఇటుగా కొనుగోలు చేసి కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసేందుకు యత్నిస్తున్నట్లు చెబుతున్నారు. కాగా, నాణ్యతా ప్రమాణాల పేరిట గరిష్ట ధరతో పోలిస్తే కనిష్ట ధరలో రూ.7 వేల మేర తేడా ఉంటోంది. గరిష్ట ధర రూ.21వేలుగా పలికినప్పుడు కనిష్ట ధర రూ.13,600గా ఉండగా, సోమవారం గరిష్ట ధర రూ.18,700గా నమోదైతే కనిష్ట ధర రూ.12 వేలుగా పలకడం గమనార్హం.

దిగుబడి లేదు.. ధర లేదు..



రెండు మిర్చి సాగు చేస్తే రూ.లక్షల్లో పెట్టుబడి అయింది. తొలి కోతలో 8 బస్తాల దిగుబడి వస్తే క్వింటాకు రూ.17,500ల ధర పెట్టారు. కమీషన్, ఖర్చులు పోతే చేతికి క్వింటాకు రూ.16,500 మించి రావు. తెగుళ్లతో దిగుబడి తగ్గిపోతే... ధర కూడా పడిపోవడంతో అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు. – అజ్మీరా బుచ్చా, తాళ్ల ఊకల్, మహబూబాబాద్ జిల్లా

ధర పడిపోతోంది..



మిర్చి ధర రోజురోజుకు పడిపోతంది. నేను ఆరు ఎకరాల్లో మిర్చిని సాగు చేసి.. తామర పురుగు నివారణకు వారానికి రెండు సార్ల చొప్పున మందులు పిచికారీ చేశా. ఇప్పుడు 70 బస్తాల మిర్చిని విక్రయానికి తీసుకువచ్చా. పంట నాణ్యతగా ఉన్నప్పటికీ రూ.18 వేల ధర మాత్రమే చెల్లించారు. – దుద్దుకూరి వెంకటేశ్వర్లు, పండితాపురం, కామేపల్లి మండలం

రాబోయే ఐదేళ్లలో 100 మిలియన్ టన్నుల ఉత్పత్తి

- త్వరలో సింగరేణిలో 558 ఉద్యోగాల భర్తీ
- సింగరేణి డైరెక్టర్ చంద్రశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ చంద్రశేఖర్, పక్కన అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): రాబోయే ఐదేళ్లలో సింగరేణి సంస్థ ఆధ్వర్యాన 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి ప్రణాళిక రూపొందించగా... ఈ ఏడాది 70 మిలియన్ టన్నుల లక్ష్యసాధనకు కృషి చేస్తున్నామని సింగరేణి డైరెక్టర్ (పా అండ్ ఆపరేషన్స్) ఎస్.చంద్రశేఖర్ వెల్లడించారు. కొత్తగూడెంలోని ఇల్లెందు గెస్ట్ హౌజ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి నుంచి సరఫరా చేసే బొగ్గు ఉత్పత్తి కారణంగా సుమారు రెండు వేలకు పైగా పరిశ్రమల్లో దాదాపు లక్ష మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. అలాగే, తెలంగాణతో పాటు మరో ఏడు రాష్ట్రాలలోని విద్యుత్ ప్లాంట్లకు అవసరమైన బొగ్గు సరఫరా చేస్తున్నామని చెప్పారు. సింగరేణి డైరెక్టర్(ఈ అండ్ ఎం) సత్యనారాయణరావు మాట్లాడుతూ తాజాగా కరీంనగర్‌లో నీటిపై తేలియాడే సోలార్ ప్లాంట్ ప్రారంభం కాగా, త్వరలోనే ఈ ప్లాంట్ ద్వారా వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి అవుతుందని వెల్లడించారు. జీఎం పర్సనల్ (ఐఆర్‌పీఎం) అందెల ఆనందరావు మాట్లాడుతూ గతేడాది రూ.26 వేల కోట్ల టర్నోవర్ సాధించగా, ఈసారి అది రూ.36 వేల కోట్లకు పెరగడంతో కంపెనీ నికర లాభాలు సుమారు రూ.20 వేల కోట్లు దాటే అవకాశముందని తెలిపారు. జీఎం పర్సనల్ (రిక్రూట్‌మెంట్ సెల్) కట్టా బసవయ్య మాట్లాడుతూ ఫిబ్రవరి నెలలో 558 పోస్టుల భర్తీకి సంబంధించి నోటిఫికేషన్ వెలువడుతుందని చెప్పారు. ఇందులో ఇంటర్నల్ 277 పోస్టులు, 281 ఎక్స్‌టర్నల్ పోస్టులు ఉంటాయని తెలిపారు. ఇంకా ఈ సమావేశంలో పీఓలు బేతిరాజు, గట్టుస్వామి, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ పాసినెట్ పాల్గొన్నారు.

మారుమూల ప్రాంతాలకూ 4జీ సేవలు



సమావేశంలో పాల్గొన్న చైర్మన్, తదితరులు

ఇల్లెందురూరల్: మారుమూల ప్రాంతాలకు కూడా 4జీ, ఎఫ్‌టీటీహెచ్ సేవలు అందించేందుకు బీఎస్‌ఎన్‌ఎల్ సిద్ధంగా ఉందని టెలికాం అడ్వైజరీ గ్రూప్ చైర్మన్ ప్రభాకర్‌రావు వెల్లడించారు. పట్టణంలోని బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయంలో వినియోగదారుల అడ్వైజరీ కమిటీ సమావేశం సోమవారం జరగగా ఆయన మాట్లాడారు. ఆధునిక సేవలతో బీఎస్‌ఎన్‌ఎల్ వినియోగదారులకు మరింత చేరువయ్యే ప్రయత్నం చేస్తోందన్నారు. ఈమేరకు వినియోగదారులు సద్వినియోగం చేసుకునేలా సభ్యులు అవగాహన కల్పించాలని తెలిపారు. ఇంకా ఈ సమావేశంలో డీజీఎం నవీన్, ఏజీఎం గోవింద్, డీఈలు సుభాష్, శ్రీనివాసరావుతో పాటు ఉద్యోగులు శ్రీనివాసరావు, సునీల్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల దాతృత్వం

వృద్ధ మహిళకు నాలుగు చక్రాల బండి అందజేత



ముత్యాలమ్మకు బండి అందిస్తున్న అధికారులు

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం జిల్లాకు నలుగురు అధికారులు దాతృత్వాన్ని చాటుకున్నారు. నాలుగు చక్రాల తోపుడు బండిపై పండ్లు అమ్ముకుని జీవించే వృద్ధ మహిళ ఉపాధి నిమిత్తం జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు సారథ్యాన మరో ముగ్గురు అధికారులు సుమారు రూ.10వేల విలువైన నాలుగు చక్రాల బండిని సోమవారం జెడ్పీ కార్యాలయ ఆవరణలో అందజేశారు. గతంలో పిల్లి ముత్యాలమ్మ నాలుగు చక్రాల బండిపై పండ్లు అమ్ముకుంటుండగా, ఆ బండిని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ విషయమై ముత్యాలమ్మ కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌ను కలిసి విన్నవించగా, అప్పుడు పక్కనే ఉన్న సీఈఓ అప్పారావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఏలూరి శ్రీనివాసరావు, జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.శ్రీరాం, డీఆర్డీఓ విద్యాచందన సొంత ఖర్చుతో ఆమెకు బండి సమకూర్చారు.

ఆయిల్‌పామ్ లక్ష్యాలను పూర్తి చేయండి



ఆర్‌అండ్‌బీ ఈఈ శ్యాంప్రసాద్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం జిల్లాలో నిర్దేశిత ఆయిల్ పామ్ పంటల సాగు లక్ష్యాన్ని పూర్తిచేయడంపై దృష్టి సారించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2022–23 ఆర్థిక సంవత్సరం 12,100 ఎకరాల్లో ఆయిల్ పామ్ మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించగా ఈనెల వరకు 8,500 ఎకరాలకు గాను 7,207.85 ఎకరాల్లో పూర్తయిందని తెలిపారు. మిగతా లక్ష్యాన్ని చేరుకునేందుకు నీటి వసతి, విద్యుత్ సౌకర్యం ఉన్న భూములు కలిగిన రైతులను గుర్తించాలని, పురోగతి లేని మండలాలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. మండలాల వారీగా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈసమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల, ఉద్యానవన సహాయ సంచాలకులు కె.అనిత, అధికారులు జి.సందీప్‌కుమార్, జి.నగేష్, ఏ.వేణు, పి.అపర్ణ, కె.మీనాక్షి, పి.నాగమణి, ఏ.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు సన్మానం

ఖమ్మం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(ఐడీఓసీ) నిర్మాణంలో పాలు పంచుకున్న ఆర్‌అండ్‌బీ ఈఈ శ్యాంప్రసాద్, ఏఈఈ విశ్వనాథ్, ఎస్ఆర్ఆర్ కంపెనీ బాధ్యులను సోమవారం కలెక్టర్ గౌతమ్ సన్మానించారు. నాణ్యతలో రాజీ పడకుండా, అనుకున్న సమయం కంటే త్వరగా పూర్తిచేశారని అభినందించారు. ఎస్ఆర్ఆర్ కంపెనీ డైరెక్టర్ రంగయ్య, బాధ్యులు జగదీష్, వెంకటేష్, శ్రీనివాస్, భాను, ప్రశాంత్‌ను సన్మానించగా అదనపు కలెక్టర్లు స్నేహలత, ఎన్.మధుసూదన్, డీఆర్వో శిరీష, ఆర్డీఓ రవీంద్రనాథ్ పాల్గొన్నారు.